# ''వేలాండి - చిరునవ్వు''

ముందుగా మన కథలో కథానాయకుణ్ణి పరిచయం చేసుకుందాము. హైదరాబాదులో ఒక ప్రభుత్వ ఆసుపత్రిలోని, హృదయ చికిత్సా విభాగంలో, ఎంతో మనస్ఫూర్తిగా, అంకితభావంతో, అహోరాత్రులు పనిచేసే నాల్గవ తరగతి సిబ్బంది వేలాండి తెల్లవారగానే ఐ.సి.సి.యు అనే వార్డులో ఊడ్చటమూ, తడిగుడ్డతో శుభ్రము చేయడం, రోగులకు కావల్సినది సమకూర్చడం. ఆ మంచి మనిషి చేసే శుభకార్యాలు ఎప్పుడు ఎవరికి కావలసి వచ్చినా అతను అక్కడ వుండకుండా వుండడు. తన డ్యూటీ ఎప్పుడు మొదలువుతుంది? ఎప్పుడు ముగుస్తుంది అనేది అతనికి తెలియని విషయం. మామూలు పనిలోగాని, సేవా తత్పరతలోగాని, ఏ లోపము అతనివల్ల ఎప్పుడూ జరుగదు. అక్కడ పనిచేసే నర్సులకు, డాక్టర్లకు వేలాండి అంటే ఎంతో ఇష్టం. ఎవరు ఏ పని చెప్పినా అది ఆలస్యం చేయకుండా, ఎంతో శుభ్రంగా చేసి పెడతాడు. రోగులకూ, రోగులతో కూర్చున్న మనోరోగులకు వేలాండి అంటే చాలా ఇష్టంగానే వుంటుంది. అతని సేవాతృష్ణతో తృప్తి పొందలేని వారు ఎవరూ వుండరు. అతను ఎప్పుడు ఇంటికి వెళతాడు, ఎప్పుడు నిద్రపోతాడు, అతనికి భార్య పిల్లలు వున్నారా లేదా అనే విషయాలు ఎవరికీ తెలియవు. కారణమేమిటంటే అతని వ్యక్తిగత విషయాల గుఱించి ఎవరూ ఏమీ అడగడం అతనికి నచ్చేది కాదు. అడిగితే, అతనికి కోపం వస్తుందని కాదు; జవాబివ్వడు అంతే! అదేవిధంగా రాజకీయం గురించి గాని, ఆసుపత్రి రాజకీయం గురించిగాని చర్చించటం అతనికి అతితిక్తమయిన విషయం. అతనికి చెప్పడానికి, చేయడానికి ఒకే ఒక విషయముంది - రోగులకు చేసే సేవ... అతని మనసుకు, శరీరానికి హాయిని ఇచ్చేది ఆ సేవా తత్పరత మాత్రమే. అది - 'పరోపకారమిదం శరీరం' అనే మనస్తత్వం వల్లనో, లేక, అతని బుద్ధిమాంద్యం వల్లనో అని ఎవరైనా సందేహించినా అతనేం పట్టించుకోడు. కష్టపడి పనిచేయడంలోనే అతనికి ఆత్మ సంతృప్తి కలుగుతుంది. వేలాండికి ఎవరితోగూడా ఏలాంటి గొడవ లేదు. ఏం భావం లేదు. నింద లేదు. ఎవరుకూడా అతన్ని తిట్టడానికి అవకాశం లేదు. ఒకవేళ తిట్టినా మారు మాట్లాడకుండా వెళ్లిపోతాడు.

ఇహ వేలాండి గురించి కొంచెం అధ్యయనం చేసి చూద్దాం. అయితే ఆ 'రిసర్చ్'కు కావాల్సిన 'రెఫరెన్సు'లు దొరగడం కష్టం కావడం వల్ల సరయిన నిగమనాలకు (deductions) రావడంకూడా కష్టమే. వేలాండి తల్లి 'తూతుక్కుడి'కి చెందినదట. వేలాండికి పితృతుల్యుడైన వ్యక్తి ఆంధ్రకు చెందినవాడని అందుకే వేలాండి తల్లి, హైదరాబాదుకు వచ్చి చేరిందని, దాదాపు స్పష్టంగా అనుకోవచ్చు. పితృతుల్యుడైన వ్యక్తి అని చెప్పడానికి, తండ్రియని కరాఖండిగా చెప్పలేక పోవడానికి తగిన కారణాలు న్నాయి. ఆ పితృతుల్యుడు, ఆమెను అగ్ని సాక్షిగా గాని, ఇతరులను సాక్షులుగా

చేసుకొనిగానీ వివాహమాడినట్లు ఏలాంటి దాఖలాలు లేవు. ఆమె అదృష్టం వలననో లేదా, ఈ దేశంలో వున్న కుటుంబ నియంత్రణ విధానం యొక్క గొప్పదనం వలననో, లేదా దైవ కారుణ్యం వల్లనో వేలాండికి (సోదరీ) సోదరులు ఎవరూ లేరు. అతని జననం తూతుక్కుడిలో జరిగిందా, మద్రాసు పట్టణంలో జరిగిందా అతనికి తెలియదు. ఎందుకంటే అతనికి జ్ఞానం వచ్చినప్పటినుంచి, అతను హైదరాబాదులోనే వున్నట్లు తెలుసు. అతనికి దాదాపు పది పన్నెండు సంవత్సరాల వయసులో తల్లి కళ్లుమూసింది. తండ్రిపేరు అడిగితే ఇవ్వడానికి జవాబు లేదు. ఒకవేళ ఆ పేరు దొరికినా అతణ్ణి తండ్రి అని పిలువడానికి కావాల్సిన యోగ్యతగాని, అర్హతగాని, అతనికి వుందా అని తెలుసుకోవడానికి వేలాండికి సాధ్యంకాదు. ఎందుకంటే, అతని తల్లి అతనితో హైదరాబాదుకు వచ్చిందో లేక అతన్ని వెతుకుతూ, వెతుకుతూ ఇక్కడుక వచ్చిందో అని ఆ దుర్బల తన ఏకైక సంతానంతో ఎప్పుడూ చెప్పలేదు. ఆ విధంగా వేలాండి తన జనకుణ్ణి చూడనే లేదు. అసలు అతనిని గురించి వినలేదు కూడా. ఆ వ్యక్తిని చూడాలని గాని, అతడి గుఱించిన ఏవైనా వివరాలు తెలుసుకోవాలని గాని వేలాండికి అభిలాష లేదు.

బాల్యం నుంచే అనాథగా పెరిగిన, వేలాండి ఎలా పెరిగాడు, ఐదవ తరతి వరకయినా ఎలా చదివాడు, తదుపరి ఏమేమి కూలి పనులు చేసుకుంటూ బ్రతికాడో అనే నిరవధిక ప్రశ్నలకు జవాబులు ఆ సర్వాంతర్యామికి తెలుసునేగాని, మన కథానాయకుడికి మాత్రం అవేమీ తెలియవని చెబితే వాస్తవం అవుతుంది. అతనికి భూతముగాని, భావిగాని, అతనికొక ప్రశ్నకాదు. దానిపై అతనికి ఏలాంటి ఆలోచనలూ లేవు. ఈరోజు తాను ఏమేమి చేయాలి అనేదొకటే అతనికి ఉన్న ఏకైక ఆలోచన.

తెలుగు, తమిళ, ఉర్దూ మూడు భాషలలో ఆయనకు మంచి జ్ఞానముంది. అంటే, ఈ మూడు భాషల్లో ఏవిషయాన్నైనా ఇతరులకు అర్థమయ్యేలా చెప్పడానికి, చెప్పింది విని తెలుసుకోవడానికి అతనికి సాధ్యమవుతుంది. అంత ప్రావీణ్యత అతను ఎలా సంపాదించగలిగాడు అనేది చాలా ఆశ్చర్యకరమైన విషయం. అంతే కాకుండా, ఇంగ్లీషులో అతనితో ఏదైనా చెబితే అతనికి అర్థమడమే కాదు. ఒక రకంగా వచ్చీ రాని ఇంగ్లీషులో దాదాపుగా జవాబు చెప్పగలడు గూడా. ఈ సామర్థ్యమంతా చింతో కాలంగా ఉన్న అనుభవంతో సంపాదించగలిగాడేమో. బాహ్య ప్రపంచం పూర్తిగా మఱచి, దైవ ప్రార్థనలో ఆనందాన్ని వెతుకుతూవున్న ఒక సన్యాసి యొక్క మనో వికారాన్ని గట్టిగా పట్టుకొని బ్రతుకుతున్న వేలాండికి దుఃఖాలు లేనే లేవు; మనస్సుఖం అయితే వుంది.

ఆ విధంగా పరోపకారార్థ మిదం శరీరం అనే నమ్మకాన్ని తన దైనందిన జీవితంలో ఆచరిస్తూ, రోగాతుర సేవనంలోనే సాయుజ్య ప్రాప్తిని పొందుతూ, స్వార్థమనే పదానికి అర్థం కూడా తెలియకుండా బ్రతుకుతున్న వేలాండి గుఱించి ఎంతో క్రూరమైన

ఒక కింవదంతి, లేక అపవాదం లేక తమాషాతో కూడిన ఒక వార్త ప్రచారంలో వుంది. అదేమిటంటే...

ఎప్పుడూ నవ్వని వేలాండి, ఎప్పుడైనా ఒక రోగిని చూసిగాని, రోగి దగ్గరవున్న బంధు మిత్రులను చూసిగాని, నవ్వాడంటే, అదేరోజు ఆ రోగి కథ సమాప్తమవుతుం దట. ఈ పుకారు, ఆ వార్డులోకే కాదు, మొత్తం ఆసుపత్రిలో చాలామందికి తెలియడంవల్ల క్రొత్తగా వచ్చి చేరుతున్న రోగులకు, రోగుల శుశ్రూష చేయడానికి వచ్చిన బంధు మిత్రాదులుకు, ఆవార్త గుఱించి తెలియడానికి ఎక్కువ ఆలస్యం జరగలేదు. అలాంటి రోగులెవరు కూడా వేలాండిని చూచి నవ్వరు. భయం ఎక్కువగా ఉన్న కొంతమంది రోగులు అసలు వేలాండి ముఖంవైపే చూడరు. కాని, దీన్ని గుఱించి, పాపం వేలాండికి మాత్రం తెలియదు. అతనితో, ఈ విషయం గుఱించి, ఇంతవఱకూ ఎవరూ ప్రస్తావించలేదు.

అరవై ఐదు దాటిన రాజారాం తల్లి, హృద్రోగ చికిత్స కోసం ఆ వార్డులో ప్రవేశించి ఇప్పటికి ఏడు రోజులయ్యింది. ఆమె పరిస్థితిలో ఇంతవరకు ఎలాంటి మార్పు రాలేదు. ఎన్నో రకాల పరిశోధనలు, సూదిప్రయోగాలు వరుసగా జరుగుతూనే వున్నాయి. ఎముకలు, చర్మం మాత్రం మిగిలిన ఆ శరీరంలో లేని రోగాలు లేవు. మధుమేహం, రక్తపీడనం ఆమెను పీడిస్తూ... పీడిస్తూ చంపుతున్నాయి. ఆమెతో ఎల్లప్పుడూ తోడుగా కూర్చునేది ఆమె కోడలు సుమతి. అత్తగారంటే సుమతికి ఇష్టం ఉందని కాదు. ఆమె ఏకైక సంతానమే గదా తన ఏకైక భర్త? అయినాగూడా, ఎప్పట్నుంచో అనేక రోగాలతో మల్లయుద్ధం చేస్తూ, యమ యాతన అనుభవిస్తున్న ఒక అత్తగారి కోడలుగా రోజులు గడపటం సుఖకరమైన అనుభవం కాదని అందరికి తెలుసు. చాలా సార్లు ఆమెను ఇదే ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పుడుకూడా సుమతే ఆమె వెంట వుండేది. అందులో, పాపం సుమతికి ఎలాంటి విసుగు లేదు. కాని,

ఈసారి ఏడు రోజులుగా సుమతి ఆసుపత్రిలో ఇలా కావలా కాస్తూ కూర్చుని వుంది దీన్నుంచి తనకు ఎప్పుడు ముక్తి లభిస్తుంది, అని అప్పుడప్పుడూ ఆలోచించ డంలో ఆమె తప్పేమీ లేదు. కూతురికి పదవతరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతు న్నాయి. ఎనిమిదవ తరగతి చదువుతున్న తన కొడుకు మహా గడుగ్గాయి. శ్రద్ధతో కూర్చుని చదవమనడానికి ఇంట్లో ఎవరూ లేరు. కూతురు రజనిని మనశ్శాంతితో చదువుకోనిస్తాడో, లేదో పాపం, రజని. ఆ పదిహేనేళ్ళ అమ్మాయి - ఇంటి పనులన్నీ చూసుకోవాలి. చదువుకోవాలి గూడా. ఈ ఏడు రోజుల్లో ఒక్కసారిగూడా, ఆ అమ్మాయి ఆసుపత్రికి రాలేకపోంది. సుమతికి కూడా అంతే. ఇప్పటికి మొత్తం రెండుసార్లు ఒకటిన్నర గంటలు పాటు మాత్రమే ఇంటికి పోగలిగింది. రోజు ఉదయం రాజారాం ఆసుపత్రికి వచ్చి ఆహార పదార్థాలు, ఇతర అవసరమైన వస్తువులు ఇచ్చి

ఆఫీసుకు వెళ్లిపోతాడు. సాయంకాలం అతను మళ్లీ వచ్చేటప్పుడు ఒక్కోరోజు ఆ తుంటరి వాడినికూడా తీసుకొచ్చేవాడు. సుమతికి, తన కూతుర్ని చూడాలని అత్యాశగా ఉంది. దానికంటే ఎక్కువగా పనిచేస్తూ అలసిపోతున్న ఆ పాపనుగురించిన ఆవేదన ఉ,ది. ఒక్కరోజు, గడుస్తుండగా ఆమె ఓర్పు తగ్గుతూ వచ్చింది. కాని, ఏం చేయడానికి ఆమెకు శక్తిలేదు గదా?

వేలాండి నవ్వుకు వున్న ఆ దివ్యశక్తి గుఱించి సుమతికి బాగా తెలుసు.

ఆసుపత్రిలో మహత్తరమైన ఎనిమిదవరోజు కూడా వచ్చింది. రోజూ లాగే రాజారాం ఉదయం వచ్చి హాజరు వేసుకొని ఆఫీసుకు వెళ్లిపోయాడు. సుమతి ఆలోచన వేలాండి నవ్వు చుట్టే వుండిపోయింది. తను ఎంతోకాలంగా పడుతున్న కష్టాలు, అతని ఒక నవ్వుతో అంతం కావడానికి అవకాశం లేదా? కానీ, తాను అలా అనుకోవడం తప్పుకాదా? కాదు, పాపం, ఈ వార్ధక్యదశలో, ఎంతోకాలం నుంచి ఈ బాధలు పడుతుంది. తాత్కాలిక రోగోపశమనంతో ఇంటికి తిరిగి వెళ్లినా గూడా ఆమె ఆరోగ్య స్థితి కొద్దిగానైనా మెరుగౌతుందా? ఆమె దుస్థితి గురించి ఎన్నోసార్లు, ఆమె కన్నీరు కార్చింది!! అందుకే ఆ వేలాండియొక్క ఒకే ఒక్క నవ్వుకు నరక యాతన అనుభవిస్తున్న ఆ మంచి అత్తకు మోక్షం ప్రసాదించే శక్తి వుంటే దాన్ని కోరుకోడంలో తప్పేం ఉంది?

ఏమైనా ఆసుపత్రిలో ఆ ఎనిమిదో రోజు సుమతి మూడుసార్లు వేలాండితో మాట్లాడింది. అంతకంటే ఎక్కువసార్లు మాట్లాడడానికి అతను కనిపించవద్దా! అతనితో మాట్లాడే సమయంలో ఆమె ముఖంలో నవ్వుగాని, చిరునవ్వుగాని పెడుతూనే వుంది. కాని ఏదయినా తమాషా చేసి ఎక్కువగా నవ్వడం, ఆ పరిస్థితులలో మంచిది కాదు కదా! కాని, వేలాండి ముఖభావంలో మాత్రం ఎలాంటి వ్యత్యాసం రావటం లేదు. అక్కడ శ్యామ మేఘాలు తప్ప, శ్వేత మేఘాలు ఒక కణిక కూడా కనిపించడం లేదు. సుమతి మాటలు, నవ్వు అతని గంభీర వదనంలో ఒక చిన్న కెరటాన్ని కూడా సృష్టించలేక పోయాయి.

అలాగే, తొమ్మిదవ రోజు కూడా ఉదయించింది. పగలు, రాత్రి ప్రయత్నించి, రెండుసార్లు సుమతి వేలాండితో మాట్లాడింది. కాదు... సరస ఉల్లాసాలు జరిపింది. కాని అదంతా ఒన్ వే ట్రాఫిక్కే గదా! చిన్న చిన్న తమాషాలు చేసే సుమతి నవ్వినా గూడా అతనిలో ఎలాంటి భావ ఛాయ లేదు. సుమతికి, అందులో ఆశ్చర్యం కాని, నిరాశగాని కలగలేదు. భగీరథ ప్రయత్నం గురించి, రోబర్ట్‌బ్రూస్ గుఱించి చదివిన ఆమెకు ఆ నాలుగో, ఐదో విఫల ప్రయత్నాలు మనోదుఃఖాన్ని కలిగించవు. కాని, అనిశ్చితత్వమనే తాత్కాలికమైన మబ్బు నుంచి బయట పడడానికి ఆమె ఎంతో

ఆరాట పడింది. దానికి, ఆమెకున్న ఒకే ఒక మార్గదర్శి వేలాండి. కాని, అతని నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేదు కదా!

పదవరోజు కూడా వచ్చింది. ఉదయం లేవగానే సుమతిలో ఉదయించిన ఆలోచన ఏమిటంటే, ఈరోజు వేలాండితో మాట్లాడడానికి ఎప్పుడు వీలవుతుందోనని త్వర త్వరగా బాతురూమ్‌కు వెళ్ళి కాలకృత్యాలు ముగించుకొని తిరిగి అత్తగారి బెడ్ దగ్గరకు చేరింది. సాక్షాత్ వేలాండి ఆమెకు దగ్గర నిలబడి వున్నాడు. అతను నిద్రపోతున్న ఆమె ముఖాన్నే శ్రద్ధగా చూస్తూ వున్నాడు. సుమతిని చూడగానే ''అహ్! ఇంత తొందరగా తిరిగి వచ్చారా?'' అనే ప్రశ్నార్థక భావంతో ఒక చిరునవ్వు నవ్వాడు. సుమతి అది నమ్మలేక పోయింది. ఏమిటి? వేలాండియేనా నవ్వింది? తను వేలాండి ముఖంలో చూస్తున్నది నిజంగా చిరునవ్వేనా?

ఆ నవ్వు ఒక చిన్న మెఱుపు మెరిసినట్టుగా వుంది. ఆ ఆశ్చర్యానుభూతి నుండి సుమతి బయటపడే టప్పటికి, ఆ మెరుపుకు కారకుడయిన కారు మేఘం రంగంలో లేదు. ఆమె హృదయం వేగంగా కొట్టుకొంటుంది.

ఉదయమే టిఫిన్ తీసుకొని వచ్చిన రాజారాంని చూడగానే, ఆమెలో ఒక రకమైన అపరాధ భావన తలెత్తింది. ఆయన మళ్లీ సాయంత్రం వచ్చేవరకు, అతని తల్లి ఈ లోకంలో వుంటుందో, లేదో అని ఒక సందేహం కలగడం వల్ల ఒక వంక కలవరపాటు. మరోవంక ఉపశమన భావన, కలసిన ఒక మానసిక స్థితిలో ఆమె వుండిపోయింది.

మధ్యాహ్నం మూడున్నర అయి వుంటుంది. భోజనం తర్వాత విశ్రమించే సమయంలో సుమతికి బాగా కునుకు పడుతోంది. మగత నిద్రలోంచి, అకస్మాత్తుగా కళ్లు తెరిచి చూసిన సుమతికి ఒక అనుమానం - అత్తగారికి శ్వాస ఆడుతోందో లేదో కొంచెం కష్టపడి ఊపిరి తీసుకుంటున్నప్పుడు అందులో ఒక ప్రత్యేకమైన తాళం, లయ వుంటుంది. కాని, ఇప్పుడు ఎలాంటి శబ్దం వినిపించడం లేదే. సుమతి వ్రేలు ఆమె ముక్కుదగ్గర పెట్టి చూసింది. నిశ్వాసపు జాడలేదు. సుమతి పరుగెత్తి కెళ్లి నర్సును పిలుచుకొని వచ్చింది. ఆ నర్సు ఆమెను పరీక్షించి, మళ్లీ సుమతిని అడిగింది. ''ఈరోజు వేలాండి ఈమెను చూసి నవ్వాడా?''

''లేదు, అతను నన్ను చూసి నవ్వాడు''

''అయితే కరెక్టే. ఇంక మీరెళ్లి మీవారికి ఫోన్ చేయండి. నేను డాక్టరును తీసుకొస్తాను. ఆమె కష్టకాలం ముగిసినందుకు, దేవుడికి, వేలాండికి కృతజ్ఞతలు తెలుపుదాం.... ఏయ్! ఈ విషయం గురించి ఆయనకు చెప్పకూడదు! సుమా.''

---